క్లుప్తంగా

గంగాలమ్మతల్లి గుడికి బొడ్డేడ రూ.50వేల విరాళం



రూ.50వేలు విరాళం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్

మునగపాక : మూలపేటలో గంగాలమ్మతల్లి గుడి నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ రూ.50వేల విరాళం అందజేశారు. ఆలయ నిర్మాణంలో భాగంగా ఇప్పటికే పలువురు దాతలు ముందుకొచ్చి తమ వంతు సహకారాన్ని అందజేస్తున్నారు. దీనిలో భాగంగా కమిటీ సభ్యులకు ప్రసాద్ తన వంతు సాయం అందజేశారు. సర్పంచ్ భీశెట్టి గంగప్పలనాయుడు, ఎంపీటీసీ కాండ్రేగుల వెంకటలక్ష్మి, కమిటీ సభ్యులు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

పూలే బీసీఆర్ స్కూల్ చైర్మన్‌గా వెంకటరమణ



వెంకటరమణ

కోటవురట్ల : కాకినాడ జిల్లా కరపలో ఉన్న మహాత్మా జ్యోతిబా పూలే బీసీ రెసిడెన్షియల్ స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్‌గా కె.వెంకటాపురం గ్రామానికి చెందిన గొల్లు వెంకటరమణ ఎన్నికయ్యారు. ఈ నెల 8వ తేదీన జరిగిన ఎస్‌ఎంసీ ఎన్నికల్లో తల్లిదండ్రులు ఏకగ్రీవంగా వెంకటరమణను ఎన్నుకున్నారు. ఈ మేరకు పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో లలితాదేవికి పూజలు



గంగాదేవిపేటలో లలితాదేవి పూజలు

మునగపాక:మండల వ్యాప్తంగా శ్రావణమాసంలోని తొలి శుక్రవారం పూజలు భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. లలితాదేవి అమ్మవారిని భక్తులు పూజించారు. మూలపేట పంచాయతీ శివారు గంగాదేవిపేటలో ఉప సర్పంచ్ మొల్లేటి దేవీచంద్ర ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన లలితా దేవి పూజా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మహిళలు పెద్దసంఖ్యలో తరలివచ్చి లలితాదేవిని దర్శించుకున్నారు.

గంగాలమ్మ ముఖద్వారం ప్రారంభం



గంగాలమ్మ ముఖద్వారం ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్

మునగపాక : మూలపేటకు చెందిన స్వర్గీయ మొల్లేటి శంకర్ గణేష్ జ్ఞాపకార్థం తల్లిదండ్రులు పరమేష్–మాణిక్యం దంపతులు రూ.8 లక్షల వ్యయంతో నిర్మించిన గంగాలమ్మ ముఖద్వారాన్ని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ శుక్రవారం ప్రారంభించారు. అనకాపల్లి –పరవాడ మార్గంలో మూలపేట జంక్షన్ వద్ద గంగాలమ్మ ముఖద్వారం ఏర్పాటు సంతోషకరమని అన్నారు. దాతలైన పరమేశ్వరరావు దంపతులను అభినందించారు. సర్పంచ్ భీశెట్టి గంగప్పలనాయుడు, ఎంపీటీసీ కాండ్రేగుల వెంకటలక్ష్మి, గ్రామస్తులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

నక్కపల్లి తహసీల్దార్‌గా అంబేడ్కర్



అంబేడ్కర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న వీఆర్వోలు

నక్కపల్లి : స్థానిక తహసీల్దార్‌గా ఎస్.వి.అంబేడ్కర్ నియమితులయ్యారు. గత ఎన్నికల ముందు ఈయన తహసీల్దార్‌గా పని చేశారు. సార్వత్రిక ఎన్నికల బదిలీల్లో భాగంగా అంబేడ్కర్‌ను శ్రీకాకుళం జిల్లాకు బదిలీ చేశారు. ఎన్నికల అనంతరం తిరిగి ఆయనను నక్కపల్లి బదిలీ చేయడంతో శుక్రవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. తహసీల్దార్‌ను కార్యాలయ సిబ్బంది, మండలంలో వివిధ గ్రామాల్లో పనిచేస్తున్న వీఆర్వోలు మర్యాదపూర్వకంగా కలిసారు.

విత్తనశుద్ధితో తెగుళ్లకు చెక్...

ఆరుగాలం ఇంటిల్లిపాది కష్టపడి పనిచేస్తారు. అయితే ప్రకృతి విలయతాండవం చేయడమో లేకుంటే పంట తెగుళ్ల బారిన పడడమో వంటి కారణాలతో రైతులు ఆర్థిక ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ప్రధానంగా వరిలో తెగుళ్ల బెడద లేకుండా రైతులు విత్తన శుద్ధిపై అవగాహన పెంచుకుంటే ఆశించిన దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయాధికారులు రైతులకు భరోసా కల్పిస్తున్నారు.



విత్తన శుద్ధిపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

- పొలంబడి కార్యక్రమం ద్వారా రైతులకు అవగాహన
- సుడోమోనాస్‌తో విత్తనశుద్ధికి అవకాశం



ఆకుమడుల కోసం సిద్ధం చేసిన భూమి

మునగపాక : వ్యవసాయంలో రాణించేందుకు రైతులకు ఎప్పటికప్పుడు పొలంబడి కార్యక్రమాన్ని వ్యవసాయాధికారులు చేపడుతున్నారు. ఈ కార్యక్రమం ద్వారా రైతుల సందేహాలను నివృత్తి చేయడంతో పాటు మెరుగైన దిగుబడుల సాధనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నారు. రైతుల కమతాల వద్దకు అధికారులు వచ్చి పంటల సాగులో తీసుకోవాల్సిన మెళకువలు అలాగే తెగుళ్లు సోకకుండా ముందస్తు చర్యలపై ఎప్పటికప్పుడు పొలంబడి కార్యక్రమం నిర్వహిస్తూ వస్తున్నారు. ఈ సందర్భంగా వరిలో యాజమాన్య పద్ధతులు, తెగుళ్ల నివారణపై నిపుణుల సూచనలు ఇలా ఉన్నాయి.

సుడోమోషన్‌తో విత్తన శుద్ధి...

ప్రతి పంట సాగులోనూ తెగుళ్ల బెడద సహజం. ప్రధానంగా వరి పంటలో తెగుళ్ల బెడదను నివారించేందుకు వ్యవసాయశాఖ విత్తనశుద్ధి కార్యక్రమం నిర్వహిస్తుంది. విత్తనం, నేల ద్వారా వచ్చే తెగుళ్లను అరికట్టేందుకు విత్తనశుద్ధి దోహదపడుతుందని అధికారులు చెబుతున్నారు. 30 కిలోల విత్తనాలలో 250 గ్రాముల సుడోమోషన్‌ను , 90 గ్రాముల కార్బండిజమ్‌ను కలిపి 24 గంటల పాటు ఊరిన తర్వాత పంట పొలాల్లో జల్లాలి. తక్కువ ఖర్చుతో విత్తన శుద్ధి చేసుకోవడం ద్వారా రైతులకు మేలు జరుగుతుందని అధికారులు వివరిస్తున్నారు. గతంలో విత్తన శుద్ధి లేకుండా వరి విత్తనాలు విత్తేవారు. దీంతో తెగుళ్ల బెడద నుంచి తేరుకోలేకపోయేవారు. వరిలో పొడతెగులు, అగ్గి తెగుళ్ల నివారణకు విత్తనశుద్ధి ఒక్కటే మార్గం.

వరిలో యాజమాన్య పద్ధతులు...

నారు తీసేటపుడు మొక్కలు లేత ఆకుపచ్చి రంగులో ఉంటే మొన త్వరగా తిరుగుతుంది. 4 నుంచి 6 ఆకులున్న నారును ఎంచుకోవాలి. పైపైన నాట్లు వేస్తే పిలకలు ఎక్కువగా తొడిగే అవకాశం ఉంటుంది. చదరపు మీటరుకు 33 మొనలు ఉండేలా చూసుకోవాలి.ముదురునారు నాటేటపుడు చదరపు మీటరుకు 44 మొనలు నాటుకోవాలి. నాటిన తరువాత ప్రతి రెండు మీటర్లకు 20 సెంటీమీటర్ల వంతున బాటలు ఏర్పాటు చేసుకోవాలి. అలా చేయడం ద్వారా పైరుకు గాలి,వెలుతురు తగిలి తెగుళ్ల బెడద తగ్గుతుంది. ఎరువులు వేయడానికి అలాగే పురుగు మందులు, కలుపు మందుల పిచికారీకి కాలిబాటలు ఉపయోగకరంగా ఉంటాయి. నారుమడిలో లేత ఆకులు తెల్లగా మారితే ఇనుపలోపంగా గుర్తించి నివారణకు లీటరు నీటికి 20 గ్రాముల అన్నభేధి, రెండు గ్రాముల నిమ్మఉప్పు కలిపి పిచికారీ చేయాల్సి ఉంటుంది.

పొలంబడితో అవగాహన



పొలంబడి కార్యక్రమం ద్వారా పలు విషయాలపై అవగాహన కల్పిస్తున్నారు. గతంలో విత్తన శుద్ధి అంటే తెలిసేది కాదు. నేడు పొలాల వద్దకు అధికారులు వచ్చి విత్తనశుద్ధిపై అవగాహన కల్పిస్తున్నారు. తెగుళ్ల బెడద నుంచి కాపాడుకునేందుకు విత్తన శుద్ధి ఉపయోగకరంగా ఉంటుందని తెలుసుకోగలిగాం.

–యల్లపు రామసూరి, రైతు, అరబుపాలెం

మెరుగైన దిగుబడులకు సూచనలు



నారుమడుల్లో తెగుళ్లను నివారించేందుకు విత్తనశుద్ధి దోహదపడుతుంది. విత్తన శుద్ధి లేకుండా విత్తనాలు విత్తితే తెగుళ్ల బెడద పెరిగి, ఖర్చు పెరిగిపోతుంది. రైతులపై భారం లేకుండా ఉండేందుకు పొలంబడి కార్యక్రమం ద్వారా అవగాహన కల్పిస్తున్నాం. అధికారుల సూచనలు పాటిస్తే మెరుగైన దిగుబడులు సొంతం.

–సీహెచ్.జ్యోత్స్నకుమారి, మండల వ్యవసాయాధికారి

పెరటితోటల పెంపకంతో మహిళల ఆర్థికాభివృద్ధి



వాడ్రాపల్లిలో పెరటితోటల పెంపకంపై ఆడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న దృశ్యం

మునగపాక : పెరటితోటల పెంపకం ద్వారా మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త దివ్య పేర్కొన్నారు. వాడ్రాపల్లిలో శుక్రవారం రిలయన్స్ ఫౌండేషన్, కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఆడియో కాన్ఫరెన్స్ ద్వారా పెరటితోటల పెంపకంపై అవగాహన కల్పించారు. గ్రామీణ ప్రాంత మహిళలు రక్తహీనతతో బాధపడుతున్నట్టు గుర్తించామన్నారు. ఇందుకోసం కూరగాయల పెంపకం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. చిరు ధాన్యాలను ఆహారంగా తీసుకోవడం ద్వారా శరీరానికి అవసరమయ్యే పోషకాలు అందుతాయన్నారు. పెరటితోటల పెంపకంపై నిర్వహించిన ఆడియో కాన్ఫరెన్స్‌కు మహిళలు హాజరయ్యారు. కార్యక్రమంలో రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధులు తిరుమలరావు, రామచంద్రరావు పాల్గొన్నారు.

సర్వసౌభాగ్యదాయినిగా వరలక్ష్మి అమ్మవారు



సర్వసౌభాగ్య దాయినిగా దర్శనమిచ్చిన వరలక్ష్మి

పాయకరావుపేట (నక్కపల్లి) : శ్రావణ మాసం మొదటి శుక్రవారం సందర్భంగా చిట్టూరి మెట్రోనందు వేంచేయనున్న శ్రీవైకుంఠ నారాయణ సహిత శ్రీ వరమహాలక్ష్మి అమ్మవారు గాజుల అలంకరణలో శోభాయామానంగా సర్వసౌభాగ్య దాయినిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా కుంకుమ పూజలు, సౌందర్య లహరి పారాయణం జరపబడినది. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం



బోదిగల్లంలో మానవ హారం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

నక్కపల్లి : ప్రస్తుతం గ్రామాల్లో ప్రబలుతున్న సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలంటూ పెదబోదిగల్లం గ్రామంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి అవగాహన కల్పించారు. శుక్రవారం పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. తెలుగు ఉపాధ్యాయుడు ఎన్.వి.ఎస్ ఆచార్యులు మాట్లాడుతూ మారిన వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో గ్రామాల్లో వైరల్ జ్వరాలు, అతిసార, డెంగ్యూ వంటి వ్యాధులు వ్యాపిస్తున్నాయన్నారు. ముందుగా స్వీయ రక్షణ కార్యక్రమాలు పాటించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. భోజనానికి ముందు, తర్వాత చేతులు శుభ్రంగా కడుక్కోవాలన్నారు. నిల్వ ఉన్న పదార్థాలు తినడం వల్ల దోమలు ఎక్కువగా వ్యాపించడం వల్ల టైఫాయిడ్, ఫైలేరియా వంటి వ్యాధులు సోకే అవకాశం ఉందన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని, తాగిపారేసిన కొబ్బరి బొండాలు పరిసరాల చుట్టుపక్కల ఉండకుండా చూసుకోవాలన్నారు. అతిసార, జ్వరం, దగ్గు, తలనొప్పి వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీపంలో ఉన్న డాక్టర్‌ను సంప్రదించాలన్నారు. వండిన పదార్థాలపై మూతలు పెట్టుకోవాలని సూచించారు. విద్యార్థులతో మానవహారం నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు సత్యనారాయణ, ఉపాధ్యాయులు ఫల్గుణరావు, ఎ.వి.ఎల్.కుమారి పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో కొత్త స్కానింగ్ పరికరం



కొత్త స్కానింగ్ పరికరాన్ని ప్రారంభించిన దృశ్యం

పాయకరావుపేట (నక్కపల్లి): పట్టణంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం గర్భిణుల కోసం కొత్త స్కానింగ్ పరికరాన్ని డాక్టర్ సుభాష్, డాక్టర్ వి.ఎస్.సౌందర్య, డాక్టర్ ఎ.జయలక్ష్మి (గైనాకాలజిస్ట్) ప్రారంభించారు. ప్రతి నెలా 9 వ తేదీన గర్భిణులకు ప్రత్యేక వైద్య చికిత్సలు చేస్తారు. కావున ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి



జాతీయ రహదారిపై వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ అప్పలరాజు

పాయకరావుపేట (నక్కపల్లి) : విద్యార్థులు, యువతీ, యువకులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, వాటి వల్ల ఎంతో హాని వుందని సీఐ పి.అప్పలరాజు అన్నారు. పట్టణంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం తాండవ సెంటరు వద్ద వాహనాలను తనిఖీ చేశారు.

28 వరకు ఓపెన్ టెన్త్, ఇంటర్‌కు గడువు

మాకవరపాలెం: ఓపెన్ స్కూల్ ద్వారా పది, ఇంటర్‌లో ప్రవేశాలకు ఈ నెల 28వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవచ్చని ఎంఈవో మూర్తి శుక్రవారం తెలిపారు. పది ఫెయిలైన వారు మధ్యలో బడి మానేసిన వారు పదో తరగతిలో ప్రవేశాలకు అర్హులన్నారు. వయసు 14 ఏళ్లు నిండి ఉండాలన్నారు. ఇంటర్‌కు 15 ఏళ్లు నిండి, పదిలో ఉత్తీర్ణత సాధించి ఉన్నవారు అర్హులన్నారు.

నూతన తహసీల్దార్ బాధ్యతల స్వీకారం



తహసీల్దార్‌కు స్వాగతం పలుకుతున్న మండల వీఆర్వోలు

ఎస్.రాయవరం : మండల తహసీల్దార్‌గా ఎం.విజయ్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. మండల రెవెన్యూ అధికారులు, వీఆర్వోలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఎన్నికల ముందు ఇదే మండలం నుంచి బదిలీ అయిన తహసీల్దార్ విజయ్‌కుమార్ మళ్లీ ఇదే మండలానికి వచ్చి బాధ్యతలు చేపట్టారు. తహసీల్దార్‌కు స్వాగతం పలికిన వారిలో వీఆర్వో సంఘ అధ్యక్షుడు నూకరాజు, వీఆర్వోలు సాంబశివరావు, శ్రీధర్ తదితరులు ఉన్నారు.

దోమల మందు పిచికారీ

మాడుగుల రూరల్: మలేరియా, డెంగ్యూ తదితర జ్వరాల వ్యాప్తికి అడ్డుకట్ట వేసేందుకు ముందస్తు జాగ్రత్తలో భాగంగా దోమల నివారణ మందు పిచికారీ చేయిస్తున్నట్లు కింతలి పీహెచ్‌సీ వైద్యాధికారి కె.మూలంనాయుడు తెలిపారు. జాలంపల్లి పంచాయతీ శివారు రాయిపాలెం, సిరిపురం, పిట్టగెడ్డ గ్రామాల్లో దోమల నివారణ మందు పిచికారీని శుక్రవారం ఆయన పర్యవేక్షించారు. ఇంటి పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా, లార్వా వ్యాప్తి చెందకుండా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. హెల్త్ సూపర్‌వైజర్ మహేష్, హెల్త్ అసిస్టెంట్ అల్లూరి సీతారామరాజు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయండి

మాడుగుల: 77వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా స్థానిక శ్రీదేవి ఆలయం వద్ద భారత నిర్మాణ సేవా ట్రస్ట్ నిర్వహించనున్న రక్తదాన శిబిరం పోస్టర్‌ను శుక్రవారం దేవరాపల్లి మండలం తారువలో మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన ముందుగా స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ట్రస్టు ఆధ్వర్యంలో ఏటా చేస్తున్న కార్యక్రమాలను అభినందించారు. అధిక సంఖ్యలో యువత పాల్గొని రక్తదానం చేయాలని కోరారు.

పంటల నమోదు తప్పనిసరి

దేవరాపల్లి: రైతులంతా తప్పనిసరిగా పంట నమోదు చేసుకోవాలని ఏవో వై.కాంతమ్మ తెలిపారు. వ్యవసాయ, రెవెన్యూ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో దేవరాపల్లిలో చేపడుతున్న పంటల నమోదు ప్రక్రియను శుక్రవారం ఆమె పర్యవేక్షించారు. క్షేత్రస్థాయిలో రైతులు ఏ సర్వే నంబర్‌లో ఏయే పంటలు సాగు చేస్తున్నారో తదితర వివరాలను తెలిపి అధికారులకు సహకరించాలని సూచించారు. పంటల నమోదు చేసుకున్న రైతులు ప్రభుత్వం అమలు చేసే అన్ని పథకాలకు అర్హత పొందుతారన్నారు. మద్దతు ధరకు ధాన్యం విక్రయించుకోవచ్చునన్నారు. కౌలు రైతులు సైతం పంటల నమోదు చేసుకోవాలని సూచించారు.

పోటీ పరీక్షలపై దృష్టి పెట్టండి

యలమంచిలి రూరల్ : గ్రామీణ ప్రాంత విద్యార్థులు పోటీ పరీక్షలపై దృష్టి పెట్టాలని యలమంచిలి గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.చంద్రశేఖర్ సూచించారు. శుక్రవారం కళాశాల జవహర్ నాలెడ్జ్ సెంటర్(జేకేసీ) ఆధ్వర్యంలో పోటీ పరీక్షలపై నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన విద్యార్థులను ఉద్దేశించి మట్లాడారు. సాధారణ డిగ్రీ కోర్సులు పూర్తి చేసిన తర్వాత గ్రామీణ ప్రాంత విద్యార్థులు సరైన లక్ష్యం నిర్దేశించుకుని ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగితే పోటీ పరీక్షల్లో విజయం సాధించడానికి అవకాశం ఉంటుందన్నారు. డిగ్రీ అర్హతతో ఏపీ పోటీ పరీక్షలు ఉన్నాయి. వాటికి అవసరమైన జనరల్ స్టడీస్, హిస్టరీ, కరెంట్ అఫైర్స్, ఎకనమిక్స్, పాలిటిక్స్ వంటి సబ్జెక్టులపై నిపుణులైన అధ్యాపకులతో రెండు నెలలు శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. వీటి కోసం 70 మంది విద్యార్థులను ఎంపిక చేశామన్నారు. ఈ తరగతులను సద్వినియోగం చేసుకుని భవిష్యత్తులో పోటీ పరీక్షల్లో విజయం సాధించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో జేకేసీ కోఆర్డినేటర్ వెంకన్న, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ పోలిరెడ్డి పాల్గొన్నారు.

బోధనా ప్రమాణాలు పెంచాలి



పంచదార్ల హైస్కూల్లో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఈవో అప్పారావు



పంచదార్ల హైస్కూల్లో విద్యార్థులతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఈవో అప్పారావు

రాంబిల్లి (యలమంచిలి) : విద్యార్థులకు అర్థవంతమైన రీతిలో ఉపాధ్యాయులు బోధన చేయాలని యలమంచిలి ఉప విద్యాశాఖాధికారి పి.అప్పారావు అన్నారు. శుక్రవారం రాంబిల్లి మండలం పంచదార్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. పాఠశాలలో మౌలిక సదుపాయాలను పాఠశాల ఆవరణను పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థుల నోట్ పుస్తకాలను తనిఖీ చేసి విద్యార్థులను పలు ప్రశ్నలు వేసి జవాబులు అడిగారు. ఉపాధ్యాయులతో మాట్లాడుతూ విద్యార్థులకు తరగతుల వారీగా వారికి విపులంగా వివరించి బోధన చేయాలని సూచించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ప్రతి రోజు క్రమం తప్పకుండా విద్యార్థుల నోట్ పుస్తకాలను తరగతి ఉపాధ్యాయుడు విధిగా చూడాలని విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాన్ని గుర్తించి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని కోరారు. పాఠశాలలో మరుగుదొడ్లను పరిశీలించి పాఠశాలలో పారిశుధ్యం చర్యలపై సంతృప్తి వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజనం వంటకాలను రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలో వివిధ తరగతుల విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలలో శత శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా ప్రతి ఉపాధ్యాయుడు పని చేయాలని కోరారు.

జెడ్పీ హైస్కూలుకు పూర్వ విద్యార్థుల వితరణ

- రూ.2 లక్షలతో సరస్వతి విద్యావేదిక ఏర్పాటు



మునగపాక హైస్కూల్లో సరస్వతి విద్యా వేదిక ప్రారంభోత్సవంలో పూర్వ విద్యార్థులు

మునగపాక : మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్లో చదువుకున్న పూర్వ విద్యార్థులు తాము చదువుకున్న పాఠశాలకు తమ వంతు సాయం అందించేందుకు ముందుకు వచ్చారు. 1995–96లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు హైస్కూల్‌కు అవసరమయ్యే విద్యా వేదిక నిర్మించేందుకు ముందుకొచ్చారు. రూ.2 లక్షల మేర పూర్వ విద్యార్థులంతా నగదు పోగు చేసి సరస్వతి విద్యావేదికను నిర్మించారు. శుక్రవారం రాంబిల్లి ఎంఈవో సూర్యారావు, పూర్వ విద్యార్థులంతా కలిసి విద్యావేదికను ప్రారంభించారు. ఈ సందర్భంగా సంబంధిత విద్యార్థులు మాట్లాడుతూ చదువుకున్న పాఠశాలకు తమవంతు సాయం అందించేందుకు ముందుకొచ్చామని విద్యార్థులు ఇష్టపడి చదువుకొని మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలువురు పూర్వ విద్యార్థులు, ప్రస్తుతం చదువుకుంటున్న విద్యార్థులు పాల్గొన్నారు.

పూడిమడక రోడ్డులో లారీ బోల్తా



ఘటనా స్థలంలో లారీ

మునగపాక : మండలంలోని గంగాదేవిపేట దరి పూడిమడక రోడ్డులో లారీ బోల్తాపడింది. ఈ సంఘటనలో ప్రమాదం తప్పింది. దీంతో ఊపిరి పీల్చుకున్నారు. అచ్యుతాపురం నుంచి అనకాపల్లి వైపునకు యాష్‌తో కూడిన లారీ శుక్రవారం సాయంత్రం వెళుతుంది. మునగపాక మండలం గంధాదేవిపేట దగ్గరకు వెళ్లేసరికి లారీ టైర్ పంక్చర్ అయింది. దీంతో రోడ్డును ఆనుకొని ఉన్న సాగునీటి కాలువలో లారీ బోల్తా పడింది. డ్రైవర్‌కు ఈ సంఘటనలో గాయాలు కావడంతో అతనిని అనకాపల్లి వందపడకల ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదం సంభవించిన సమయంలో ఈ మార్గంలో ఎటువంటి వాహనాలు రాకపోవడంతో ప్రమాదం తప్పినట్టయింది. అయితే లారీ బోల్తా పడిన సంఘటనకు సంబంధించి విద్యుత్ శాఖకు చెందిన స్తంభం దెబ్బతింది. విషయం తెలుసుకున్న ఏఈ గోపీ సంఘటన స్థలానికి చేరుకొని విద్యుత్ సరఫరా నిలిపివేశారు. అలాగే విషయం తెలుసుకున్న ఏఎస్‌ఐ రామకృష్ణ ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు.

పంటల నమోదు పై అవగాహన సదస్సు



ఈ పంట నమోదుపై సిబ్బందితో అవగాహన సదస్సు నిర్వహించిన ఏవో ఆదినారాయణ

పాయకరావుపేట(నక్కపల్లి): మండల రెవెన్యూ కార్యాలయంలో ఈ పంటలపై అవగాహన సదస్సు మండల వ్యవసాయ శాఖ అధికారి పి.ఆదినారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామాల్లో రైతులు వేస్తున్న పంటల పై ఆయా గ్రామాల్లో సిబ్బంది పంటల నమోదు కార్యక్రమం నిర్వహించాలన్నారు. అదే విధంగా కౌలు రైతులు గుర్తింపు కార్డులు కూడా త్వరితగతిన అందించాలన్నారు. ఈ సమావేశంలో మండల రెవెన్యూ అధికారులు, డీటీలు అప్పారావు, రాజేంద్రప్రసాద్, సర్వేయర్లు, వీఏఏలు, వీఆర్‌వోలు, ఏఈవో భారతి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

యలమంచిలి రూరల్ : మండలంలోని పురుషోత్తపురం, పులపర్తి, బయ్యవరం, పీఎస్‌ఆర్‌పేట గ్రామాల్లో విద్యుత్ లైన్ల నిర్వహణ పనుల నిమిత్తం శనివారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏపీఈపీడీసీఎల్ డివిజన్ ఈఈ కె.రాజశేఖర్ మీడియాకు తెలిపారు. ఈ గ్రామాల్లో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు అవకాశం మేరకు ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటలోపు విద్యుత్ సరఫరా ఇస్తామన్నారు. రైతులు, విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

రాంబిల్లి పరిధిలో..

రాంబిల్లి (యలమంచిలి) : విద్యుత్ మరమ్మతులు జంగిల్ క్లియరన్స్ విద్యుత్ తీగలపై చెట్ల కొమ్మల తొలగింపులో భాగం శనివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు రాంబిల్లి మండలం పంచదార్ల, భోగాపురం, ధారపాలెం, అప్పారాయుడుపాలెం, వెంకటాపురం, హరిపురం గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడునుందని విద్యుత్ శాఖ ఈఈ కె.రాజశేఖర్ శుక్రవారం సాయంత్రం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.